


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 3 సంచిక -89 శనివారం 5 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

● పలు అభివృద్ధి పనులు పరిశీలించిన సీఎం రేవంత్ ● హకీంపేట్ ఎడ్యుకేషన్ పనులపై ముఖ్యమంత్రి ఆరా

**హైదరాబాద్‌సెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):**కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళు న్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాం?ఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. మిగతా2లో...



## విద్యార్థులను తీర్చిదిద్దడంలో టీచర్లదే కీలకపాత్ర

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిలీసెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):** విద్యా ర్థులకు సరైన మార్గనిర్దేశం చేస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె శుక్రవారం శు భాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల మార్గనిర్దేశం, మెంటార్‌షిప్ ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారి వ్యక్తిత్వ వికాసానికి బలమైన మిగతా2లో...

## 6న ఎర్రవల్లిలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష భేటీ

- పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సమావేశం




## కేసీఆర్ చాలా మంచోడు.. హుందాగా రిసీవ్ చేసుకునేవారు

- కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ సెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):**మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం... ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ... "కేసీఆర్ గారు చాలా మంచి వ్యక్తి. తమను ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీలో మిగతా2లో...

## హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు

- సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్







## కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

- లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసానికి పిలుపు

**హైదరాబాదసెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వేదిక నుంచి ఆహ్వానం అందింది. యూరప్‌లో స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్, పెట్టుబడుల రంగాలకు సంబంధించిన ప్రముఖ మిగతా2లో...

## జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం


జియోసింక్రోనస్ కక్ష్యలోకి దేశ మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):**భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ఇస్రో ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారి జియో-ఆర్బిట్ కోసం ఉద్దేశించిన అత్యాధునిక ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహం జూూ-05ను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో రియల్ టైమ్ ఇమేజరీ అందించడంలో ఈ ఉపగ్రహం ఎంతో కీలకం కానుంది. రెండో లాంచ్ ప్యాడ్ నుంచి వేకువ జామున 2గంటల 55నిమిషాలకు జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహం జూూ-05ను నింగిలోకి మోసుకెళ్లింది. సబ్-జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. సుమారు 8నెలల విరామం తర్వాత ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 19వ రాకెట్ ప్రయోగం. 2,268 కిలోల మిగతా2లో...

## ఢిల్లీలో కుండపోత వర్షం

● జలమయమైన విమానాశ్రయం ● విమాన సేవలకు తీవ్ర అంతరాయం




## కొండా సురేఖను తొలగించారు..

- పొంగులేటి సంగతి ఏమిటి?:

- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు



# జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

బరువు ఉన్న -05 ఉపగ్రహం సరిహద్దు ప్రాంతాలను వేగంగా, స్పష్టంగా కెమెరాలతో పరిశీలించనుంది. తుపానులు వరదలు, భూకంపాలను నిమిషాల వ్యవధిలోనే గుర్తించనుంది. ప్రకృతి విపత్తులపై ముందస్తు హెచ్చరికలను జారీ చేయనుంది. పంటల ఆరోగ్యం, భూ వినియోగంలో మార్పులను పరిశీలించనుంది. దేశ రక్షణరంగంలో ఈ ఉపగ్రహం కీలకం కానుంది. సరిహద్దుల సమాచారాన్ని రియల్ టైమ్‌లో సేకరించనుంది. వరుసగా ఎదురైన వైఫల్యాల తర్వాత ఇస్రో సాధించిన ఈ విజయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు చేపట్టిన 18 ప్రయోగాల్లో ఈ రాకెట్ 6సార్లు పూర్తిస్థాయి విజయాన్ని నమోదుచేయలేకపోయింది. 2021లో మిషన్ ప్రయోగం 307సెకన్ల తర్వాత క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో విఫలమైంది. దానికి ప్రత్యామ్నాయంగా ఈ మిషన్‌ను విజయవంతంగా చేపట్టారు. అంతకుముందు ఈ ఏడాది జనవరి 12న 16ఉపగ్రహాలతో ప్రయోగించిన రాకెట్ కీలకమైన మూడోదశలో తలెత్తిన లోపం కారణంగా నిర్దేశిత కక్ష్యలోకి చేరలేకపోయింది. 2025 మే నెలలో చేసిన ౹ూూం-జ 61 ప్రయోగం కూడా మోటార్ కేస్‌లో ప్రెజర్ సమస్యల వల్ల సక్సెస్ కాలేదు. ఈ నేపథ్యంలో ఇస్రో సుదీర్ఘ విరామం తర్వాత జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం చేసింది. మరోవైపు ప్రతిష్మాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా తొలి మానవరహిత మిషన్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ ఎ.నారాయణన్ వెల్లడించారు. దీనికోసం వివిధ పరిశ్రమలు, ఇతర సంస్థలతో కలిసి ఇస్రో బృందం అత్యంత ప్రణాళికాబద్ధంగా, ముమ్మరంగా పనిచేస్తోందని తెలిపారు. ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టాక ఇస్రో ఛైర్మన్ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈఓఎస్-05 ప్రయోగం ద్వారా ఇస్రో తొలి విజయాన్ని నమోదు చేసిందని పేర్కొన్న ఆయన, కష్టానికి దక్కే ప్రతిఫలం మరింత కష్టపడటమేనని ఉద్ఘాటించారు. దేశ బహుళ అవసరాల నిమిత్తం భూమిని నిశితంగా పరిశీలించేందుకు 36,000 కి.మీ.లు జియో సింక్రనస్ ప్లాట్‌ఫారమ్‌లో ఉంచుతున్న మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషమని అన్నారు. జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' వేదికగా ఇస్రో బృందానికి అభినందనలు తెలిపారు. 'అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన మరో అతిపెద్ద పేలోడ్ ఇది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారతదేశ అంతరిక్ష సామర్థ్యాలు సరికొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయి. ప్రపంచ అంతరిక్ష శక్తిగా మన దేశం బలపడుతోంది' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు.

# కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందు కొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. దౌలతాబాద్ మండలం గోకఫసల్వాద్ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్ ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్?ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. 430 పడకల ఆస్పత్రి పనులపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో పనులు చేయించాలని నాణ్యత, సాంకేతిక అంశాలు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని ల్యాండ్ స్కేపింగ్ పనులకు వాడాలని సీఎం సూచించారు. అనంతరం కొండగల్ నియోజవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటనల అనంతరం రోడ్డు మార్గాన కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రికి అక్కడే సీఎం బస చేయనున్నారు. రేపు కొడంగల్‌లో ప్రభుత్వాసుపత్రి ఆర్? అండ్ బీ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు

**హైదరాబాదసెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):**తెలం గాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగి ంచడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు.

ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉం దని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధా రంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరిం చారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు.
వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తా యని సూచనప్రాయంగా చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.



# కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసం చేయాలని నిర్వాహకులు కేటీఆర్‌ను ఆహ్వానించారు. లక్సెంబర్గ్‌లో అక్టోబర్ 14, 15 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమానికి తరఫున ఆహ్వానం అందింది. ఆసియా, యూరప్ దేశాల్లో పెట్టుబడుల విధానాలు ఎలా భిన్నంగా ఉంటాయి? పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే ధోరణి, స్టార్టప్ వ్యవస్థాపకుల అంచనాలు, పెట్టుబడి అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం వంటి అంశాలపై ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక సెషన్‌లో కేటీఆర్ మాట్లాడాలని నిర్వాహకులు కోరారు. భారత్‌ను అంతర్జాతీయ పెట్టుబడి, ఆవిష్కరణ వ్యవస్థలతో అనుసంధానించడంలో కేటీఆర్‌కు ఉన్న అనుభవం యూరప్‌లోని పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులకు ఉపయోగపడుతుందని తమ ఆహ్వానంలో నిర్వాహకులు పేర్కొన్నారు. భారత్, ఇతర అంతర్జాతీయ మార్కెట్ల మధ్య పెట్టుబడి సంబంధాలను పెంపొందించడంలో ఆయన దృక్పథం కీలకమని వారు అభిప్రాయపడ్డారు. యూరప్‌లోని ప్రముఖ పెట్టుబడిదారులు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, విధాన నిర్ణేతలు పాల్గొనే ఈ కార్యక్రమం స్టార్టప్ ఫైనాన్సింగ్, వ్యాపార వృద్ధిపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. గత ఏడాది జరిగిన లక్సెంబర్గ్ వెంచర్ డేస్‌కు 28 దేశాల నుంచి 3,400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారిలో 300 మందికిపైగా పెట్టుబడిదారులు, 110 వెంచర్ క్యాపిటల్ ఫండ్ల ప్రతినిధులు ఉన్నారు యూరప్‌కు చెందిన పలు ప్రముఖ వెంచర్ క్యాపిటల్ సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

# తెలంగాణలో కొత్తగా చేయూత పింఛన్లు

**• ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరణ**



**హైదరాబాద్ సెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తులకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు సమయంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు క్లారిటీ ఇచ్చారు. ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుల పరిశీలన సమయంలో మాత్రం కచ్చితంగా సమర్పించాలని సూచించారు. గీత కార్మికులకు ఆబ్కారీశాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణ పత్రం లేకున్నా ఆధార్, రేషన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒంటరి మహిళలకు తహసీల్దారు ధ్రువీకరణ పత్రం కావాలి.. దివ్యాంగులకు సదరం, యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ ఏడీ ధ్రువీకరణ పత్రం ఉండాలి. దరఖాస్తు సమయంలో ఈ ధ్రువీకరణ పత్రం లేకపోయినా పర్లేదని.. పరిశీలన సమయంలో మాత్రం సమర్పించాలని సూచించారు. గతంలో పింఛన్లు వచ్చి, ఆ తర్వాత ఆయా కారణాలతో ఆగిపోయిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. పరిశీలన సమయంలో మాత్రం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును కూడా పొడిగించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జులై 31తోనే గడువు ముగిసింది.. కానీ సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేయని చాలామంది ఉన్నారు.. వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు నిర్వహిస్తారు. రాష్ట్రంలో చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆగస్టు 30 వరకు మొత్తం 4.34 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా 2.64 లక్షల మంది వితంతువుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం గడువు పెంచడంతో మరో 50వేలకుపైగా దరఖాస్తులు వస్తాయని అచంనా వేస్తున్నారు,

# విద్యార్థులను తీర్చిదిద్దడంలో టీచర్లదే కీలకపాత్ర

(మొదటి పేజీ తరువాయి)

పునాది వేయవచ్చని రాష్ట్రపతి పేర్కొన్నారు. అంకితభావంతో, శ్రద్ధతో పనిచేసే ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక సామర్థ్యాన్ని గుర్తించి, వారిలో స్ఫూర్తిని నింపడంతో పాటు అత్యుత్తమ ప్రతిభను కనబరిచేలా ప్రోత్సహించగలరని ఆమె అన్నారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ జ్ఞానాన్ని నవీకరించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలని, వినూత్న బోధనా పద్ధతులను అనుసరించాలని ముర్ము సూచించారు. విద్యార్థుల్లో స్వతంత్ర ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు ప్రశ్నించే, విషయాలను లోతుగా తెలుసుకోవాలనే ఆసక్తిని ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని ఆమె చెప్పారు. భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు.

# ఢిల్లీలో కుండపోత వర్షం

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):**దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# కొండా సురేఖను తొలగించారు

**హైదరాబాద్‌సెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):**ను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమె త్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్‌లోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితా లోని పేదల భూ ములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమ స్యలపై ప్రశ్ని స్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవ మానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాం కు లు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

# 6న ఎర్రవల్లిలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష భేటీ

**• పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సమావేశం**

**హైదరాబాద్ సెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):**7 నుంచి రాష్ట్ర శాసన సభ సమావేశాలు ప్రారంభం కానున్ననేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష సమావేశం నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 06 న ఎర్రవల్లి నివాసంలో మధ్యాహ్నం 1 గంటకు లంచ్ అనంతరం 2 గంటలకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులతో కూడిన సంయుక్త సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు.

# కేసీఆర్ చాలా మంచోడు.. హుందాగా రిసీవ్ చేసుకునేవారు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన కొండా సురేఖ.. కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి... బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా? అనే ప్రచారం జోరందుకుంది.

# జుక్కల్ చౌరస్తా వద్ద బస్సు ప్రమాదం

**జుక్కల్ సెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):**జుక్కల్ చౌరస్తాలో వద్ద బస్సు ప్రమాదానికి గురైతంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతి చెందగా, మరో 12 మంది గాయపడ్డారు. ప్రమాద సమా చారం అందుకున్న వెంటనే జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారిలో ఒకరికి తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన క్షతగాత్రులకు బిచ్కుంద ఆసు పత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధి కారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

# హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం

**వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమిటి? -ధర్మసాగర్‌లో బీఆర్ఎస్ వంటావార్పు.. ప్రభుత్వంపై నేతల ధ్వజం**






**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోసెప్టెంబరు 4 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు గున్‌రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం ధర్మసాగర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ కాలనీ నుంచి బస్టాండ్ వరకు నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గున్‌రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, ధాన్యానికి బోనస్, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి పథకం, రూ. 2,500 ఆర్థిక సాయం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు తదితర హామీలను కాంగ్రెస్ తన ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా ప్రకటించిందన్నారు.రైతులకు పూర్తిస్థాయిలో



రుణమాఫీ చేస్తామని చెప్పి అనేక ఆంక్షలు విధించారని, రైతుభరోసా విషయంలోనూ రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర, ధాన్యానికి బోనస్ వంటి హామీల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. రైతులు ఎరువులు, యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. యువతకు ఏటా వేలాది ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పక్కన పెట్టిందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వ విధానాలతో యువతలో నిరాశ పెరుగుతోందన్నారు. మహిళలకు నెలకు రూ. 2,500 సాయం, వృద్ధులు, వితంతువులు, ఇతర అర్హులకు పెన్షన్లు పెంచుతామని చెప్పిన హామీలను కూడా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని ప్రకటించినా గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన అనేక కుటుంబాలు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్మసాగర్ మండలంలో రైతులు, కూలీలు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మానికి ప్రతీక శ్రీకృష్ణుడు

**ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు.. ఆకట్టుకున్న ఉట్లు, జారుడు స్తంభం పోటీలు**



**కేసముద్రం/సెప్టెంబరు 4 (జర్నలిస్ట్ వార్త):** శ్రీకృష్ణుడు ధర్మం, ప్రేమ, జ్ఞానానికి ప్రతీక అని యాదవ సంఘం మండల అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. కేసముద్రం స్టేషన్‌లో శుక్రవారం మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన ఉట్లు కొట్టే కార్యక్రమం, జారుడు స్తంభం పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా అల్లం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీకృష్ణుడు అధర్మాన్ని అణచివేసి ధర్మాన్ని కాపాడారని తెలిపారు. ప్రతి ఒక్కరూ కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తిస్తూ, కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆయన బోధించారని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు ఆరాధ్య దైవమే కాకుండా గొప్ప గురువుగా, స్నేహితుడిగా, మార్గదర్శిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్‌రావు, సారగొల్ల సంగె రాజ్‌కుమార్, మండల యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి నాగనబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు అల్లం శ్రీకాంత్, నర్సింగం వెంకటేశ్వర్లు, తోడేటి వెంకటేశ్వర్లు, అల్లం నిరంజన్, ఏలుగు కార్తీక్ యాదవ్, సంగె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు



**తల్లాడ/సెప్టెంబరు 4 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి ఎమ్మార్ గార్డెన్‌లో నిర్వహించిన మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సీతక్క, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర నాయకుడు దయానంద్ విజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ దివాకర్ ఐఏఎస్, ఏసీపీ వసుంధర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్తుపల్లికి వచ్చిన మంత్రి సీతక్కను తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మండల నాయకుడు జక్కంపూడి కిషోర్, సత్తుపల్లి నియోజకవర్గ బీఎల్ఏ ఇన్‌చార్జి రాయల రాము, అన్నారుగూడెం గ్రామశాఖ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి సీతక్కతో తాజా రాజకీయ పరిణామాలపై వారు చర్చించారు. అనంతరం ఖమ్మం జిల్లాకు వచ్చిన మంత్రి సీతక్కను నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, మరసకట్ల బాబు, మిట్టపల్లి సర్పంచ్ పొట్రూ స్వప్నశరత్, అన్నారుగూడెం మాజీ వీవీడీసీ చైర్మన్ మారెళ్ల మల్లికార్జునరావు, తాళ్ల జోసెఫ్, యల్లంకి వెంకటయ్యతో పాటు పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## వీరభద్రరావు, చిన్న దుర్గయ్యకు కాంగ్రెస్ నేతల పరామర్శ



**తల్లాడ/సెప్టెంబరు 4 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన గంగాదేవిపాడు సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావును కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల ఆయన మోకాలి శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆయన స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మర్సకట్ల బాబు, మండల అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, మండల నాయకులు జక్కంపూడి కిషోర్, మిట్టపల్లి సర్పంచ్ పొట్రూ శరత్, అన్నారుగూడెం మాజీ వీవీడీసీ చైర్మన్ మారెళ్ల మల్లికార్జునరావు, తాళ్ల జోసెఫ్, ఎల్లంకి వెంకటయ్య తదితరులు వీరభద్రరావును పరామర్శించారు. సన్నిహితులు తనను పరామర్శించేందుకు రావడంతో వీరభద్రరావు ఆనందం వ్యక్తం చేశారు.

**చిన్న దుర్గయ్యకు పరామర్శ** : మిట్టపల్లి గ్రామ సర్పంచ్ పొట్రూ స్వప్న భర్త శరత్ బాబాయ్ పొట్రూ చిన్న దుర్గయ్య ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సీఐ శ్రీనివాస్‌కు మహేందర్ శుభాకాంక్షలు



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో సెప్టెంబరు 4 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ధర్మసాగర్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో సీఐగా శ్రీనివాస్ సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

## సీఐ శ్రీనివాస్‌కు బీజేపీ నేతల శుభాకాంక్షలు



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోసెప్టెంబరు 4 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ సీఐగా నూతన బాధ్యతలు స్వీకరించిన ఎ. శ్రీనివాస్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నిమ్మ సుదర్శన్‌రెడ్డి, నాగావెల్లి యుగేందర్, గంకిడి వెంకట్‌రెడ్డి, పెరుమాండ్ల అమరేందర్‌రెడ్డి, పులి శ్రీనివాస్, దుస్సా రాములు, బచ్చు శివప్రసాద్‌రెడ్డి, సాయం సందీప్, గాజ శ్యాంసుందర్, మాచర్ల అనిరుద్, గంగారపు రమేష్, కన్నెబోయిన శ్రీధర్, చింతల రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన టీడీపీ నేత



**ఖమ్మం/ సెప్టెంబరు 4 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం పట్టణంలోని డాక్టర్ పెద్దినేని శ్రీకాంత్, డాక్టర్ జ్యోష్న మెటర్నిటీ అండ్ ఫెర్టిలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకురాలు, ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు గుమ్మడి నరసయ్య, టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్

**1000 రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమిటి? బీఆర్ఎస్ నేతలు**





**కేసముద్రం/సెప్టెంబరు 4 (జర్నలిస్ట్ వార్త):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా. ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు.

మహబూబాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో కేసముద్రంలోని జ్యోతిరావు పూలే సెంటర్ వద్ద శుక్రవారం వంటావార్పు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత హాజరై కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.

ఎన్నికల ముందు ప్రజలకు రంగుల కలలు చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్. ఆ తర్వాత హామీలను విస్మరించిందని వారు ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను ఎలాంటి షరతులు, నిబంధనలు, కాలయాపన లేకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1000 రోజుల పాలనలో ప్రజలకు సాధించిపెట్టిందేమిటో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

**హామీల అమలుకు పోరాటం**

ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తుందని నేతలు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నారాయణరావు, మాజీ జెడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, రంగారావు, ఓలం చంద్రమోహన్, నజీర్, కముటం శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, రమేష్, కౌన్సిలర్లు వినయ్, శారద, అరుణ, రాజమణి, ఆగె రాము, శరత్‌యాదవ్, గుగులోతు వీరునాయక్, రవిచంద్రరెడ్డి, ఊకంటి యాకూబ్‌రెడ్డి, బీర్రు వెంకన్న, పోలు వెంకన్న, కొమ్ము రాహుల్, ఏర్పుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీపీ ఎర్రోళ్ల సీతయ్య మృతి



**ఎల్కతుర్తి/సెప్టెంబరు 4 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండల తొలి మాజీ ఎంపీపీ ఎర్రోళ్ల సీతయ్య (80) అనారోగ్యంతో శుక్రవారం స్వగ్రామం కోతులనడుమలో మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. సీతయ్య మృతి పట్ల గ్రామస్థులు, మండల ప్రజలు సంతాపం తెలిపారు.

సీతయ్య 19861990 మధ్య ఎల్కతుర్తి మండల ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన ఆయన హుజూరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా కూడా సేవలందించారు. మాజీ ఎమ్మెల్యే దుగ్గిరాల వెంకట్రావు, మాజీ మంత్రి ఈనుగాల పెద్దిరెడ్డికి సన్నిహితుడిగా కొనసాగారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలానికి పలు సంక్షేమ పథకాలు తీసుకురావడంలో ఆయన కీలకంగా వ్యవహరించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సీతయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఆయన మృతి మండలానికి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు.

# 35 ఏళ్ల విద్యాసేవకు
## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ఇటీవల ప్రస్తుత జిల్లా కలెక్టర్ చే సత్కారం



ప్రస్తుత జిల్లా పోలీసు కమిషనర్ గారిచే....

**సత్తుపల్లి/సెప్టెంబరు 4 (జర్నలిస్ట్ వార్త):** 35 ఏళ్లుగా విద్యారంగానికి విశేష సేవలందిస్తున్న విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు (ఎంఏ, బీఈడీ) జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందజేయనుంది.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా పనిచేస్తున్న నాగేశ్వరరావు 2007లో 'మీ లక్ష్యం మీ చేతుల్లో' పుస్తకాన్ని రచించారు. విద్యార్థుల్లో నైతిక, మానవీయ విలువలను పెంపొందించేందుకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల విద్యార్థులకు పరీక్షల సన్నద్ధత, ప్రజెంటేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంపై ఉచిత శిక్షణ ఇస్తున్నారు.

### విద్యార్థుల విజయాల్లో ప్రత్యేక ముద్ర

విశ్వశాంతి విద్యాలయం విద్యార్థులు విద్యా రంగంలో ప్రతిభ చాటుతున్నారు. ఇటీవల విడుదలైన తెలంగాణ పాలిసెట్ ఫలితాల్లో పాఠశాల విద్యార్థి ఆర్ఫాజ్ అలీ 120/120 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. గత ఐదేళ్లుగా పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధిస్తున్నారు. ప్రతి ఏడాది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందుతున్నారు.

### జర్నలిస్టుగానూ సేవలు

పాఠశాల నిర్వహణతో పాటు నాగేశ్వరరావు సుమారు 20 ఏళ్లపాటు ప్రముఖ దినపత్రికలో జర్నలిస్టుగా పనిచేశారు. విద్యారంగంతో పాటు సామాజిక, సాంస్కృతిక



పసుపులేటి నాగేశ్వరరావు

కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. సృజన సాహితీ సంస్థ, లయన్స్ క్లబ్, లైవ్ స్వచ్ఛంద సేవా సంస్థ, నవరస కళా పరిషత్, శ్రీరామకృష్ణ సేవా సమితి తదితర సంస్థల్లో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ (టీఆర్ఎస్ఎంఏ) అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

నాగేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడంపై విశ్వశాంతి విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. 35 ఏళ్ల విద్యాసేవకు ఈ పురస్కారం తగిన గుర్తింపని పేర్కొన్నారు.

# ప్రజలు సంయమనంతో ఉండాలి

**కోర్టు తీర్పు వచ్చే వరకు భూమి జోలికి వెళ్లొద్దు: ఎస్ఐ వెంకటకృష్ణ**





**తల్లాడ/సెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో ఆర్సీఎం చర్చి భూమి వివాదం రోజురోజుకూ ముదురుతోంది. వివాదాస్పద భూమి కోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఇరు వర్గాలు అక్కడ వివిధ చర్యలకు పాల్పడుతుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. శుక్రవారం ఓ వర్గం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను మరో వర్గం తొలగించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

వివాదాస్పద భూమి వద్ద ఓ వర్గం ఫెన్సింగ్ ఏర్పాటు చేయగా, మరో వర్గం దానిని పీకివేసింది. అంతేకాకుండా ఇరు వర్గాల మధ్య మతపరమైన అంశాలు తెరపైకి రావడం స్థానికంగా ఆందోళనకు కారణమవుతోంది. ఒక వర్గానికి వ్యతిరేకంగా మరో వర్గం హిందూ మతానికి సంబంధించిన జెండాలు ఏర్పాటు చేయడం, వాటిని తొలగించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ వివాదం ఇలాగే కొనసాగితే చిలికి చిలికి పెద్ద ఘర్షణకు, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పోలీసుల హెచ్చరిక

విషయం తెలుసుకున్న తల్లాడ ఎస్ఐ వెంకటకృష్ణ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. భూమికి సంబంధించిన వివాదం ఇప్పటికే కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున, తీర్పు వెలువడే వరకు ఎవరూ వివాదాస్పద భూమి వద్దకు వెళ్లి ఎలాంటి నిర్మాణాలు, ఫెన్సింగ్‌లు లేదా ఇతర చర్యలు చేపట్టవద్దని ఇరు వర్గాలకు సూచించారు. న్యాయస్థానం తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### మత ఘర్షణలకు తావివ్వొద్దు

భూవివాదాన్ని మతపరమైన అంశంగా మార్చకుండా ఇరు వర్గాలు సంయమనంతో వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. వివాదం కోర్టులో ఉన్న నేపథ్యంలో తీర్పు వచ్చే వరకు ఎవరూ స్వయంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులు ఇరు వర్గాలపై నిఘా ఉంచి శాంతిభద్రతలను కాపాడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# హామీల అమలుపై బీఆర్ఎస్ పోరుబాట

**హామీల అమలుపై బీఆర్ఎస్ పోరుబాట -వంటావార్పుతో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసన**

**మహిళలు, పింఛనుదారుల హామీలపై అరూరి రమేష్ ప్రశ్నలు**







**వర్ధన్నపేట/ సెప్టెంబరు 4(జర్నలిస్ట్ వార్త);** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల పోరుబాటలో భాగంగా వర్ధన్నపేట అంబేద్కర్ జంక్షన్‌లో శుక్రవారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొని ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.

మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, వాటి అమలు పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. వృద్ధులకు రూ.4 వేల పింఛను, దివ్యాంగులకు రూ.6 వేల పింఛను ఇస్తామని చెప్పిన హామీలను కూడా అమలు చేయలేదని విమర్శించారు.

ప్రజా వ్యతిరేకత పెరుగుతోందంటూ హామీల అమలులో జాప్యం వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అరూరి రమేష్ అన్నారు. మహిళలకు సంబంధించిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును అంచనా వేసి తీర్పు ఇస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపల్ కౌన్సిలర్ లు



బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి, ఆత్మా చైర్మన్ గోపాల్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ దుగ్యాల మాధవరావు, అన్ని గ్రామాల తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# జలుమూరు పీహెచ్‌సీలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**రికార్డులు, వైద్య సేవల పరిశీలన.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశం**



**జలుమూరు/సెప్టెంబరు 4 (జర్నలిస్ట్ వార్త):** జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేష్‌కుమార్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయి.. రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, రోగులకు అందుతున్న సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సిబ్బంది విధులకు సకాలంలో హాజరై సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జి. సుజాత, డాక్టర్ ఎస్. అహల్య, సీహెచ్ఓ పద్మావతి, పీహెచ్ఎన్ ఎస్. పద్మావతమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ యు. చిన్నరాజులు, సీనియర్ అసిస్టెంట్ విజయశాంతి, ల్యాబ్ టెక్నీషియన్ రాజారావు, స్టాఫ్ నర్స్ లత, ఫార్మసిస్ట్ అప్పలరాజు, హెల్త్ అసిస్టెంట్ జి. చిన్నారావు, ఆయుష్ ఫార్మసిస్ట్ ఆర్. కృష్ణారావుతో పాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు పరామర్శ



**తల్లాడ/ సెప్టెంబరు 4 (జర్నలిస్ట్ వార్త):**మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వారి కుటుంబాలను టీపీసీసీ ఎస్ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు, బీసీ సెల్ నాయకుడు కోడూరి వీరకృష్ణ పరామర్శించారు.ఇస్నేపల్లి రాములు సతీమణి కాంతమ్మ దశదినకర్మకు హాజరైన వారు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం దుండేటి కేశవరెడ్డి సతీమణి కళావతిని పరామర్శించి, అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. గుండె సంబంధిత సమస్యతో మృతిచెందిన గుండ్ల నరసింహారావు కుటుంబాన్ని పరామర్శించి, ఆయన సతీమణి గంగాభవానికి ధైర్యం చెప్పారు.కష్టకాలంలో బాధిత కుటుంబాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని నారపోగు వెంకటేశ్వర్లు తెలిపారు.కార్యక్రమంలో వార్డు సభ్యుడు విలసాగరం వెంకటరావు, యువజన నాయకుడు ఇస్నేపల్లి లక్ష్మణ్, గ్రామ పెద్దలు ఇస్నేపల్లి వెంకటేశ్వర్లు, సాధా మల్లయ్య, గొల్లమందల వెంకటేశ్వర్లు, ఇస్నేపల్లి రాములు, తోటపల్లి సుందర్, సంగెపు దావీదు, ఇస్నేపల్లి దాసు, బొడ్డు కృష్ణ, గుండ్ల బాలకృష్ణ, సున్నపు వెంకటేశ్వర్లు, డేవిడ్, పగిడిపల్లి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల వంటావార్పు నిరసన ర్యాలీ



**మిర్యాలగూడ/సెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):** ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న పోరాటాలకు మద్దతుగా మహిళలు పెద్దఎత్తున కదిలారు. మిర్యాలగూడ పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన మహిళల వంటావార్పు నిరసన కార్యక్రమంలో 6వ వార్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.మిర్యాలగూడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆదేశాల మేరకు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్ధార్థ సలహాతో ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు వంటావార్పు చేపట్టి ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల పక్షాన పార్టీ చేస్తున్న పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.6వ వార్డు ఇందిరమ్మ కాలనీ నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి వంటావార్పు నిరసన ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దీంతో పార్టీ కార్యాలయం పరిసరాల్లో కొద్దిసేపు సందడి నెలకొంది.

# యాలాద్రి కుటుంబాన్ని పరామర్శించిన ఇల్లందు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి నరేందర్.



**బయ్యారం/,సెప్టెంబర్ 4,(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలంలోని బాలాజీ పేట గ్రామంలో వేల్పుల యాలాద్రి ఈ మధ్య కాలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఇల్లందు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి నరేందర్ వారి మిత్రబృందంతో శుక్రవారం బాలాజీ పేట గ్రామంలో వారి కుటుంబాన్ని పరామర్శించి మృతుడికి ఘనంగా నివాళి అర్పించారు.అనంతరం వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో వారి వెంట బయ్యారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద నాగరాజ్,నీలారపు సతీష్, నాశబోయిన గణేష్,వేల్పుల శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త TELTEL/2023/87607
శనివారం 5 సెప్టెంబర్ 2026

# అంబేద్కర్‌ను అవమానిస్తే సహించం!

**హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి**

**దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి -వల్లందాస్ కుమార్**




**వర్ధన్నపేట/ సెప్టెంబరు 4(జర్నలిస్ట్ వార్త);**రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న హమారా ప్రసాద్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఆర్ఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు. అంబేద్కర్ ప్రపంచ మేధావి, గొప్ప దార్శనికుడని పేర్కొన్నారు. ఆయనను కించపరిచేలా రచనలు, పోస్టులు చేయడం సరికాదన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలను ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. హమారా ప్రసాద్ వెంటనే క్షమాపణ చెప్పి వివాదాస్పద పుస్తకాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# నూతన సీఐకు ఘన స్వాగతం

**సన్మానించిన మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు**



**వర్ధన్నపేట/ సెప్టెంబరు 4(జర్నలిస్ట్ వార్త);**వర్ధన్నపేట పోలీస్ సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సంజీవరావును వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్నగౌడ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ సంజీవరావుకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకంతం, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంకినేని దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కంబాలపల్లి,సత్యనారాయణ పురం సబ్ స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ అంతరాయం.

**బయ్యారం/,సెప్టెంబర్ 4.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండలంలోని కంబాలపల్లి సబ్ స్టేషన్,సత్యనారాయణపురం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు నేడు ఈ రెండు సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పవర్ సప్లై ఉండదని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.అదేవిధంగా కొత్తపేట సబ్ స్టేషన్ లో చేంజ్ ఓవర్ వర్క్ నడుస్తుంది (ఏబి స్విచ్ జంపరింగ్ వర్క్) అదేవిధంగా కొత్తపేట నుండి కంబాలపల్లి వైపు వెళ్లే 33కేవీ లైన్ లో చెట్ల కొమ్మలు విద్యుత్ అంతరాయంగా ఉన్న చెట్ల కటింగ్ చేస్తూ మెయింటెనెన్స్ వర్క్స్ జరుగుతున్నవి కావున ఈ రెండు సబ్ స్టేషన్ లో పరిధిలో గల గ్రామాల ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ రఫీ ఉద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు.

# బయ్యారంలో బీఆర్ఎస్ 'వంటా వార్పు'

**కాంగ్రెస్‌పై హరిప్రియ ఫైర్.**



**బయ్యారం/,సెప్టెంబర్ 4.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండల కేంద్రంలోని బస్ స్టాండ్ సెంటర్ లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాత గణేష్ ఆధ్వర్యంలో వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు.ఈ నిరసనలో ఇల్లందు మాజీ శాసనసభ్యులు బానోత్ హరిప్రియ నాయక్ పాల్గొని మాట్లాడారు.ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారంటీలు,ఇతర హామీలను విస్మరించి ప్రభుత్వం విఫల పాలన సాగిస్తోందని మండిపడ్డారు.తక్షణమే దివ్యాంగులు, వృద్ధుల పింఛన్లు పెంచాలని, మహిళలకు ఇచ్చిన మహాలక్ష్మి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.రోడ్డుపైనే వంటలు చేసి నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ కుమారి ఆంగోత్ బిందు,ఉపాధ్యక్షులు బానోత్ మురళీకృష్ణ,గంగుల సత్యనారాయణ,ఏనుగుల ఐలయ్య,బానోతు శ్రీను,బానోతు లక్ష్మణ్ నాయక్, రేపాకుల వెంకన్న,జరుపుల శ్రీను,సర్పంచ్ శివాజీ,దేవోజి, నీలమ్మ,లలిత, బాలకృష్ణ,భద్రయ్య,మాజీ సర్పంచులు కృష్ణకుమారి, మమత కోటి,వాంకుడోత్ జగన్,మాజీ ఎంపిటిసిలు కవిత శ్రీను నాయక్,వన్నం రామారావు, కల్పనా సునీల్,ఉదయ్,సంపత్, లేనిన్, శ్రీకాంత్,శోభన్,బిఆర్ఎస్ మండల నాయకులు,మహిళలు బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అఖిలభారత రైతు-కూలీ సంఘ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి.

**-రైతాంగ పోరాటాలను తీవ్రతరం చేద్దాం.**




**బయ్యారం/,సెప్టెంబర్ 4.(జర్నలిస్ట్ వార్త)**
సెప్టెంబర్ 8 -9 తేదీలలో మంచిర్యాలలో జరుగు అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బయ్యారం మండలంలో వెంకట్రాంపురం,బాలాజీ పేట,గౌరారం,లక్ష్మీ నరసింహ పురం,తదితర గ్రామాలలో మహాసభల పోస్టర్స్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం వ్యవసాయ కూలీలు సమరశీల పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు.2021 డిసెంబర్ 9వ తేదీన ప్రధానమంత్రి మోడీ రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని,రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ గ్యారంటీ చట్టం చేయాలని,రైతులకు రుణ విముక్తి చట్టం చేయాలని స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పోరాడుతున్న అఖిలభరత రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రైతాంగానికి,ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల ప్రధాన కార్యదర్శి తోకల వెంకన్న జిల్లా నాయకులు చింత వెంకన్న,గుండెబోయిన లింగమల్లు,మింగు భగవాన్,నూనె లింగయ్య, దేశెట్టి రవి నిమ్మరబోయిన సహదేవ్,గుడి బోయినరమేష్,కొత్త రామదాసు,బొల్లం సోమక్క నందగిరి సత్యం,వల్లాల బిక్షం అజ్మీర రాజు,బిక్షం రాంజీ తదితరులు పాల్గొన్నారు.

# ఐనవోలు కాంగ్రెస్‌లో ఆరోపణలు..-ఖండన

**కాంగ్రెస్‌లో ఉంటూ.. ప్రత్యర్థులకు అండగా!? -ఎమ్మెల్యే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని బొల్లెపెల్లి మధు ఆరోపణ**

**స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా వ్యవహరించారని వ్యాఖ్య**

**బీఆర్ఎస్ కార్యక్రమాలకు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపణ -పార్టీ వ్యతిరేక కార్యకలాపాలపై విచారణ జరపాలని డిమాండ్**







**ఐనవోలు/సెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వ్యవహారంపై మాజీ ఎంపీటీసీ బొల్లెపెల్లి మధు ఆరోపణలు చేశారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ ప్రత్యర్థి పార్టీలకు పరోక్షంగా సహకరిస్తున్నారని మధు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాల్గొనే కార్యక్రమాలకు రవీందర్‌రావు హాజరు కావడం లేదని ఆయన ఆరోపించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటున్న సమయంలోనూ రవీందర్‌రావు దూరంగా ఉంటున్నారని బొల్లెపెల్లి మధు ఆరోపించారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా వ్యక్తిగత రాజకీయ కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మధు ఆరోపించారు. స్థానిక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా రవీందర్‌రావు వ్యవహరించారని మాజీ ఎంపీటీసీ బొల్లెపెల్లి మధు ఆరోపించారు. కొందరు అనుచరులను ఇతర పార్టీలకు మద్దతుగా నిలిపారని, పార్టీకి చెందిన వార్డు సభ్యులపై ప్రత్యర్థి పార్టీ సర్పంచ్‌కు మద్దతు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు సంబంధించిన కార్యక్రమాలకు రవీందర్‌రావు దూరంగా ఉన్నారని మధు ఆరోపించారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో కొనసాగుతూనే బీఆర్ఎస్ కార్యక్రమాలకు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు.

ఈ ఆరోపణలపై పీసీసీ అధ్యక్షుడు సమగ్ర విచారణ జరపాలని బొల్లెపెల్లి మధు డిమాండ్ చేశారు. ఆరోపణలు విచారణలో నిర్ధారణ పార్టీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.





# రాజకీయ ఆరోపణల వెనుక అసలు లెక్కేంటి?

**పొమ్మనలేక.. పొగ పెడుతున్నారా?**

**రవీందర్‌రావుపై వరుస విమర్శల వెనుక ఎవరి వ్యూహం?**

**ఐనవోలులో ఆసక్తికర చర్చ**

**ఐనవోలు/సెప్టెంబర్ 4 (జర్నలిస్ట్ వార్త):**
మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుపై ఇటీవల వెలువడుతున్న విమర్శలు, ఆరోపణలు ఐనవోలు రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. ఈ విమర్శలు వ్యక్తిగత విభేదాల ఫలితమా? పార్టీ అంతర్గత పరిణామాల్లో భాగమా? లేక స్థానిక రాజకీయ ఆధిపత్య పోరుకు సంకేతమా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

**ఒకే ఊరు.. ఒకే పార్టీ.. మరి విభేదాలెందుకు?**

రవీందర్‌రావుపై ఆరోపణలు చేస్తున్న మాజీ ఎంపీటీసీ మధు, రవీందర్‌రావు ఇద్దరూ ఒకే గ్రామానికి చెందినవారు. గతంలో ఇద్దరూ టీఆర్ఎస్‌లో కొనసాగినప్పటికీ, రాజకీయ పరిణామాల నేపథ్యంలో మధు కొంతకాలం పార్టీకి దూరమై తిరిగి చేరినట్లు స్థానికంగా చర్చ ఉంది. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరూ కాంగ్రెస్‌లో చేరారు. ఒకే రాజకీయ వేదికపై ఉన్న ఇద్దరి మధ్య ప్రస్తుతం విభేదాలు తలెత్తడానికి కారణమేంటన్నదే చర్చనీయాంశంగా మారింది.

**పంచాయతీ ఎన్నికల నుంచే దూరం?**

గత గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో కొన్ని గ్రామాల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో రవీందర్‌రావు సూచించిన వ్యక్తులకు కాకుండా, స్థానిక ఎమ్మెల్యే సూచించిన అభ్యర్థులకు ప్రాధాన్యం లభించిందన్న చర్చ అప్పట్లో జరిగింది. ఐనవోలు మండలంలోని కొన్ని ప్రధాన గ్రామపంచాయతీలను ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు కైవసం చేసుకోవడం కూడా అప్పట్లో రాజకీయ చర్చకు దారితీసింది. రవీందర్‌రావుకు తెలియకుండా అభ్యర్థుల ఎంపిక, టికెట్ల పంపిణీ జరిగిందని, దీనిపై పార్టీ అధిష్ఠానం స్థానిక నాయకత్వాన్ని మందలించిందన్న ప్రచారం ఇప్పటికీ రాజకీయ వర్గాల్లో చర్చగానే మిగిలింది.

**విమర్శల వెనుక స్థానిక సమీకరణాలా?**

రాష్ట్రస్థాయిలో రాజకీయ పరిచయాలు ఉన్న నేతపై ఒక కార్యకర్త బహిరంగంగా విమర్శలు చేయడం, ఆయనపై పార్టీ చర్యలు తీసుకోవాలని పీసీసీ, డీసీసీ నాయకత్వాన్ని కోరడం చర్చకు కారణమైంది. ఇది కేవలం వ్యక్తిగత వివాదమేనా? లేక స్థానిక రాజకీయ సమీకరణాల్లో భాగమా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విమర్శలు చేస్తున్న వారి వెనుక ఏదైనా రాజకీయ వ్యూహం ఉందా ? అసలు కారణం ఏమిటన్నది స్పష్టతకు రావాల్సి ఉంది.

**మరి రవీందర్‌రావుపైనే ఎందుకు?**

నియోజకవర్గంలో పలువురు జిల్లా, రాష్ట్రస్థాయి కాంగ్రెస్ నాయకులు ఉన్నప్పటికీ, రవీందర్‌రావుపైనే వరుసగా విమర్శలు రావడం కూడా రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షిస్తోంది. వరదరాశ్వరావు, వడ్లకొండ వెంకటరెడ్డి, నమిండ్ల శ్రీనివాస్, బొంపల్లి దేవేందర్‌రావు తదితరులు పార్టీ కార్యక్రమాల్లో తమ స్థాయిలో పాల్గొంటున్నప్పటికీ, ప్రతి స్థానిక కార్యక్రమానికీ వారు హాజరవడం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇతర నాయకులపై విమర్శలు లేకపోవడం, రవీందర్‌రావుపై విమర్శలు రావడం వెనుక రాజకీయ కారణమేనని స్థానికంగా చర్చ జరుగుతోంది.

**పొమ్మనలేక.. పొగ పెడుతున్నారా?**

రవీందర్‌రావుకు, స్థానిక నాయకత్వానికి మధ్య రాజకీయ విభేదాలు ఉన్నాయా? ఉంటే అవి ఏ స్థాయిలో ఉన్నాయి? వ్యక్తిగత అంశాలు రాజకీయ విభేదాలుగా మారాయా? లేక రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ సమీకరణాలు మారుతున్నాయా? అన్న ప్రశ్నలు ఇప్పుడు ముందుకొస్తున్నాయి.

**స్పందనతోనే స్పష్టత**

ఇప్పటివరకు వినిపిస్తున్నవి ఆరోపణలు, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలు మాత్రమే. వాటిలో ఏవి వాస్తవాలు? ఏవి రాజకీయ ప్రచారాలు? అన్నది సంబంధిత వ్యక్తులు, పార్టీ నాయకత్వం స్పష్టం చేయాల్సి ఉంది.

రవీందర్‌రావుపై వస్తున్న ఆరోపణలకు స్థానిక ఎమ్మెల్యే స్పందిస్తారా? రవీందర్‌రావు స్వయంగా వివరణ ఇస్తారా? పార్టీ నాయకత్వం ఈ వ్యవహారానికి తెరదించుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వారి స్పందనతోనే ఈ వివాదం వెనుక ఉన్న అసలు రాజకీయ లెక్కపై కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.